
Sakshi Dt. 16/10/12

## పర్యావరణం, ప్రయాణికుల హితమే

# 'మెట్రో' ప్రాజెక్టు లక్ష్యం

- ఏటా 50 వేల మొక్కలు నాటడం ద్వారా నగరంలో హరిత తోరణం ఏర్పాటు
- 2014లో నాగోల్ - మెట్టుగూడ కారిడార్ పూర్తి
- 2017నాటికి మూడు కారిడార్లలో ప్రాజెక్టు పూర్తి

### మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ రెడ్డి



హైదరాబాద్, న్యూస్‌లైన్: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పర్యావరణ పరిరక్షణ, ప్రయాణికుల కష్టాలు తీర్చడమే 'ఎలివేటెడ్ మెట్రో ప్రాజెక్టు' లక్ష్యమని హైదరాబాద్ మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. కాలుష్య రహిత ప్రయాణం, తక్కువ ఇంధన వినియోగం ద్వారా నగరంలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేస్తామన్నారు. మెట్రో ప్రాజెక్టు విశేషాలు, నగర జీవ వైవిధ్య పరిరక్షణ, చారిత్రక కట్టడాల పరిరక్షణ, హెచ్‌ఎంఆర్ సంస్థ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'వనదీక్ష' కార్యక్రమంపై ఆయన 'న్యూస్‌లైన్'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ విశేషాలు..

**ప్ర:** నగర పర్యావరణ పరిరక్షణలో మీరు చేపట్టిన 'వనదీక్ష' కార్యక్రమం పాత్ర ఏమిటి?

**జ:** పర్యావరణ పరిరక్షణకు గ్రేటర్ హైదరాబాద్‌లో హరిత తోరణం ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంఆర్ సంస్థ సంకల్పించింది. ఏటా 50 వేల మొక్కలు నాటాలన్నది లక్ష్యం. విద్యా సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాలు కోరినన్ని మొక్కలు ఇస్తున్నాం. మొక్కల కోసం రోజూ అనేకమంది మా కార్యాలయానికి వస్తున్నారు. పండ్లు, పూలు, ఔషధ మొక్కల పంపిణీ, వాటి పరిరక్షణ ద్వారా పర్యావరణం, వృక్ష వైవిధ్యాన్ని కాపాడేందుకు కృషిచేస్తున్నాం.

**ప్ర:** నగరంలో ఏఏ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో మొక్కలు నాటుతున్నారు?

**జ:** ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి 54 వేల మొక్కలు నాటాలని నిర్ణయించాం. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో(12,300 మొక్కలు), ఉస్మానియా వర్సిటీ (7,000), మెట్రోకారిడార్-1, చైతన్యపురి పరిసరాల్లో (5,000), నాగోల్ బ్రిడ్జి, సాగర్ రింగు రోడ్డు (4,000), రామంతాపూర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్, పరిసర ప్రాంతాల్లో (3,500), పీజీ కాలేజి, పోలీస్ లేన్స్, హెచ్‌పీఎస్, బేగంపేట్ (3,000), మెట్రో కారిడార్-2 (2,400), మల్కాజ్‌గిరి (2,000), జేఎన్‌టీయూ - బాలానగర్ జంక్షన్(1,500), జూబ్లీహిల్స్, శిల్పారామం పరిసరాలు (1,500), ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజి - గచ్చిబౌలి (1,500), డీఆర్‌డీఎల్, డీఎల్‌ఆర్‌ఎల్ ప్రాంతాలు (1,500), నాగార్జున సర్కిల్ - మసాబ్ ట్యాంక్, బంజారాహిల్స్ (1,000), సీసీఎంబీ ప్రాంగణం (1,000)లతో మొక్కలు నాటుతాం. మిగతా ప్రాంతాల్లోనూ మరికొన్ని మొక్కలు నాటుతాం.

**ప్ర:** ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనే వారికి ఎలాంటి ప్రోత్సాహకాలు ఇస్తారు?

**జ:** ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలు, ఎన్‌జీఓలు, స్కూళ్లు, విద్యార్థి సంఘాలు ఉత్సాహంగా పాల్గొనేందుకు అనేక ప్రోత్సాహకాలు ప్రకటించాం. ఒక హెచ్‌ఎంఆర్ అధికారి, ఒక ఫారెస్ట్ విభాగం అధికారి, ఓ ఎన్‌జీఓ ప్రతినిధితో కూడిన కమిటీ విజేతలను ఎంపిక చేస్తుంది. ప్రథమ బహుమతి కింద రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.40 వేలు, తృతీయ బహుమతిగా రూ.25 వేలు ఇస్తాం. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. హైదరాబాద్‌మెట్రోరైల్.ఐఎన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయితే పూర్తివివరాలు లభిస్తాయి.

**ప్ర:** మెట్రో ప్రాజెక్టు ద్వారా నగరంలో కాలుష్యం ఏ స్థాయిలో తగ్గుతుంది?

**జ:** అత్యాధునిక మెట్రో ప్రాజెక్టు ద్వారా నగరంలో వాహన కాలుష్యం గణనీయంగా తగ్గుతుంది. మూడు కారిడార్లలో ప్రాజెక్టు పూర్తయితే నిత్యం దాదాపు 16 లక్షల మంది ఈ రైళ్లలో ప్రయాణిస్తారు. దీనివల్ల వ్యక్తిగత వాహనాల వినియోగం బాగా తగ్గుతుంది. దీంతో పీల్చే గాలిలో కార్బన్ డయాక్సైడ్ , కార్బన్ మోనాక్సైడ్, ఆర్‌ఎస్పీఎం, టీఎస్పీఎం వంటి ప్రమాదకర కాలుష్య ఉద్గారాల స్థాయి తగ్గుతుంది. తద్వారా కాలుష్యం బాగా తగ్గుతుంది. మరోవైపు మెట్రో రైళ్లలో ఇంధన వినియోగం 40 శాతం తక్కువ. బ్రేకులు వేసినప్పుడు ఉత్పన్నమయ్యే శక్తితో రైళ్లలో ఇంధన అవసరాలు తీరతాయి. ఈ విధానం ద్వారా మెట్రో సంస్థ కార్బన్ క్రెడిట్స్ (తక్కువ కాలుష్యం ఉత్పత్తి చేసే సంస్థలు పొందే ఆర్థిక ప్రయోజనాలు) పొందే అవకాశమూ ఉంది. శబ్ద కాలుష్యం కూడా బాగా తగ్గుతుంది.

**ప్ర:** ఇతర నగరాల్లోని మెట్రో ప్రాజెక్టులతో పోల్చితే నగర మెట్రో ప్రాజెక్టు ప్రత్యేకతలేమిటి?

**జ:** చెన్నై, బెంగళూరు నగరాల్లో మూడు పిల్లర్లపై మెట్రో లైను నిర్మించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. హైదరాబాద్‌లో ఒకే పిల్లర్‌పై మెట్రో మార్గం ఉంటుంది. ఇది ఎల్ అండ్ టీ ఇంజనీరింగ్ ప్రతిభకు నిదర్శనం. ఈ అత్యాధునిక డిజైన్ రూపకల్పనకు ఇంజనీర్లు 8 నెలలు కష్టపడ్డారు. స్టేషన్లను కూడా అత్యాధునిక వసతులతో నిర్మించబోతున్నాం. మూడు మెట్రో కారిడార్లలో 66 స్టేషన్లు నిర్మిస్తున్నాం. అన్ని స్టేషన్లలో ఎస్కలేటర్లుంటాయి. సమీప గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రతి స్టేషన్ వద్ద పాదచారుల కోసం స్కైవాక్‌లు నిర్మిస్తాం. సైకిల్ ట్రాక్‌లను కూడా దశలవారీగా ఏర్పాటు చేస్తాం. మెట్రో స్టేషన్లకు కుడి, ఎడమ వైపునున్న సుమారు 800 కాలనీలకు చేరుకునేందుకు మెర్రీ గో-అరౌండ్ బస్సులు నిరంతరం అందుబాటులో ఉంటాయి. జూబ్లీ బస్టాండ్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, నాంపల్లి రైల్వే స్టేషన్ల నుంచి మెట్రో స్టేషన్లకు అత్యాధునిక బస్సులు అందుబాటులో ఉంటాయి.

**ప్ర:** మెట్రో రైళ్లు ఎప్పటికి అందుబాటులోకి వస్తాయి?

**జ:** 2014 డిసెంబర్‌నాటికి నాగోల్ - మెట్టుగూడ రూట్లో 8 కిలోమీటర్ల ప్రాజెక్టు పూర్తవుతుంది. 2017 డిసెంబరునాటికి మూడు కారిడార్లలో ప్రాజెక్టు పూర్తవుతుంది. ప్రతి రైలుకు ప్రారంభంలో మూడు బోగీలుంటాయి. వీటిలో వెయ్యిమంది ప్రయాణించవచ్చు. ఆ తరువాత బోగీల సంఖ్య ఆరుకు పెంచుతాం. ప్రతి కారిడార్‌లో ఐదు నిమిషాలకో రైలు అందుబాటులో ఉంటుంది. గంటకు ఒక కారిడార్‌లో 60 వేల మంది రాకపోకలు సాగించవచ్చు.

**ప్ర:** ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయి?

**జ:** ఈ ప్రాజెక్టు ద్వారా సమీప భవిష్యత్తులో 50 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ప్రస్తుతం ఎనిమిది వేల మంది యువకులకు శిక్షణనిచ్చాం. నిర్మాణ పనుల్లో వారి సేవలను వినియోగిస్తున్నాం.

**ప్ర:** చారిత్రక కట్టడాల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

**జ:** చారిత్రక కట్టడాలకు 50 నుంచి 150 అడుగుల దూరం నుంచే మెట్రో లైను నిర్మిస్తాం. నిర్మాణ సమయంలో ఆ కట్టడాలకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ చూపుతాం.